# ప్రేమసుధ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

## తొలి చినుకు

ధరుడు చంద్రశేఖరముపంతులుగారియింటికి జేరునప్పటికి వారికొమార్తె యగు లలితాంబకు రెండువత్సరములయిన బూర్తిగ లేవు. వచ్చియు రాని పలుకులతో, తెలిసియు దెలియని చెయిదములతో, నేర్చియు నేరని నడకలతో, లలిత యప్పుడు అందఱకును, ముద్దుబిడ్డగా నుండెను. సహజముగా సౌమ్యహృదయుడును, ప్రేమ స్వభావుడును నగు శ్రీధరునకును లలితకును నత్యల్పకాలముననె మైత్రి కుదిరినది. బడినుండి వచ్చునదే తడవుగ శ్రీధరుడు లలితకై వెదకును. శ్రీధరునిపిలుపు చెవిసోకినదే తడవుగ లలిత "అన్న, అన్న" యని యాతని చేతులపై వ్రాలును. శ్రీధరుని చూచినంతనే లలిత కెంతయేదుపైన నిట్టె యెగిరిపోవును. నీలాలకలు ఫాలతలంబున జిందులాడుచుండ, ఆణిముత్తియములవంటి కన్నీటిబిందువులు చిన్నారిచెక్కిళ్లపై తళతళ మెఱయుచుండ, బొమలు కొంత ముడివైచి, మూతి రవ్వంత పొడిగించి, తలను ఇసుమంత వ్రాల్చి, తల్లిపైటచెఱగును బట్టియో, కుచ్చెళ్లబట్టియో, లాగుచు నేయాటవస్తువునకో, ఏతినుబండారమునకో మారాము చేయుచున్న లలితవీనులకు శ్రీధరుని"లలితా" యనుపిలుపు వినబడగనే యాయలుక యేమగునో, యాజగడమేమగునో? క్షణములో మోమువిప్పారి క్షీరదంతములసితకాంతులు బయల్పడ రేఖామాత్రముగనున్న పలుచని కెంబెదవిపై చిఱునవ్వు తొలకాడును. పాలబుగ్గలపై యలుకను దెలిపెడి యశ్రుబిందువులు; కెంబెదవిపై నానందమును దెల్పెడి మధుర మందహాసము; ఆహా! ఎంతమనోమోహనకరము ఆరూపు!

శ్రీధరునియందు లలిత కింతటిప్రేమయేల? లలితకు శ్రీధరు డేమైన చిఱుతిండ్లు పెట్టునా? ఆటవస్తువులు తెచ్చి యిచ్చునా? ఏమియు లేదు. నిర్ధనుడగు శ్రీధరుడు, చదువుకొను నిమిత్తము పేదతనముతో వారియింటికి జేరిన శ్రీధరుడు, ధనికులబిడ్డయగు లలితకు బసదనము లీయ సమర్థుడు గాడు. మఱి యేమి కారణము? శ్రీధరుని సహజసౌజన్యసౌహార్ద ప్రవర్తనమే!

## మలి చినుకు

లలితకు మూడేండ్లు వచ్చినవి. శ్రీధరునకు పదమూడువత్సరములు వచ్చినవి. ఇరువురకు పదివత్సరముల వ్యత్యాసమున్నను వారి పరస్పరమైత్రి కెట్టి యభ్యంతరము

గలుగ లేదు. శ్రీధరునకు బడిపాఠములు ముగిసిన వెనుక లలితతో నాడుకొనుట దప్ప వేఱు లోకమే లేదు. వానకాలమున శ్రీధరుడు లలితకు కాగితపుపడవలు గట్టి నీటిమడుగులలో దేలించి వినోదింపజేయును. గాడ్పుదినములు రాగానే గాలిపటములు చేసి యెగురవేయించును. నేలబడిన చింతగింజలు తోంకరికె మొలకలెత్తగనే పెల్లగించి వానినసుమ ప్రాచీకపుల్లల గ్రుచ్చి నునుపైనపాలగచ్చుపై బొంగరములు త్రిప్పించును. ఈరీతి నెప్పటి కప్పుడు కాలానుగుణ్యములగు క్రీడావస్తువుల జేకూర్చి యానందించు శ్రీధరుని ఒక్కక్షణమైన నెడబాయక లలిత వెంటాడి తిరుగుచుండును. చంద్రశేఖరముగారు డిసెంబరు సెలవులలో చెన్నపురి వెళ్లి లలితకొక చిన్నరంగులపెట్టను దెచ్చియిచ్చిరి. లలిత యాపెట్టనిండ వెలలేనిసామానుల జేర్చినది. సంగరరంగమున నవయవవిచ్ఛేదకులైన యోధులవలె లలితతోడి క్రీడాయుద్ధముల తలలు పగిలి, చేతులు విఱిగి, కాళ్లు పోయి, శిథిలమైనబొమ్మ లెన్నియో లలితరంగులపెట్టెలో జేరినవి. అంతియేకాదు, రంగుపోయిన లక్కపిట్లు, పగిలిపోయిన సీసాలబిరడాలు, పోయిన డబ్బాలమూతలు, చిఱిగినగుడ్డపేలికలు పండ్లూడిన దువ్వెనలు, పగిలినయద్దపుపెంకులు, చిట్లినగాజుముక్కలు, గుడ్డిగవ్వలు, గచ్చకాయలు, సుద్దముక్కలు, నాటకపుకంపెనీ కాగితములు, గుడ్డతానులమీది బొమ్మలు శుభలేఖలు, చింపిరి కాగితములు మున్నగున వెన్నియో లలితరంగులపెట్టెలో భద్రమైనవి. ఏచిన్నిడబ్బాకైన మూత దొరకకున్నను, లలితపెట్టెలో వెదకినచో నొకటిగాకున్న నొకటియైనసరిపోవును. బొట్టుపెట్టుకొనుట కద్దము గానరాకున్నచో లలితను యాచించిన నేయద్దపుపెంకుతోనైన బొట్టుపెట్టుకొనవచ్చును. ఏ చిన్నివస్తువు కనుపించకున్నను "లలితపెట్టెలో చూచిలేదనుకోండీ" అనుట యింటిలో సర్వసాధారణమైపోయినది. కించిత్తు వెలజేయని యాసామానులను జూచుకొనిన లలిత కెంతయో సంబరము. "చూడండి; నా రంగుల పెట్టెలో యెన్నివున్నాయో" అని లలిత మురుపున బల్కునప్పుడు లలిత మోమున గన్పట్టు సంతోసము, తృప్తి, మన యనుభవమున కసాధ్యము! ఎంతయో ధనధాన్యసంపత్తి సేకరించి ఎన్నియో సుఖము లనుభవించి యాయువు తఱుగుచున్నను, నాశలు పెరుగుచు తనివిలేక తల్లడిల్లు లుబ్ధమానవులకు లలిత మోమున గన్పట్టు ఆనందరసము బోధ్యమగునా? గ్రహింపసాధ్యమా?

లలిత రంగులపెట్టెలోనున్న సామానులలో లలిత యమ్మమ్మ తిరుపతివెళ్లి క్రొత్తగా తెచ్చియిచ్చిన చందనపు బొమ్మ యొక్కటే కాలుచేయి విఱుగకుండ కొంచెము బాగుగానున్నది. లలిత దానికి అమ్మమ్మబొమ్మ యని పేరుపెట్టినది. లలితకు రంగులపెట్టెమీద యెంత ప్రేమో, అమ్మమ్మబొమ్మమీద యంత ప్రేమ. లలిత యాబొమ్మకు దల్లియై సకలలక్షణముల పోషించుచుండును. లలిత తనపట్టి కొకప్పుడు శ్రీధరుని బొమ్మనుజేసి పిల్లనిచ్చి కొట్టి నిద్రపుచ్చుమనును; తండ్రిని జేసి పిల్లను

మిఠాయి తెచ్చి పెట్టుమనును; చాకలిని జేసి పిల్లను చల్లగాలికి త్రిప్పుమనును; పిల్ల నెత్తుకొను పిల్లనుజేసి పిల్ల నేడ్పించితివా యని చీవాట్లు పెట్టును.

ఇట్లా బాలగృహిణి వేవిధముల వేధింపుచున్నను శ్రీధరుడు మనోజ్ఞ మందహాసముల వానినెల్ల జేయుచుండును. ఒకప్పుడు తాను లలితకు పట్టిమై బువ్వపెట్టించుకొనుట, లాల పోయించుకొనుట, ఆముదము త్రాగుట, మున్నగు శిశూపచారముల నందుచుండును. ఒకదినమున లలిత మేనత్తయు నామెకుమారుడును వచ్చిరి. ఆ బాలునకు నాలుగేండ్లు ఉన్నవి. లలిత నాబాలునితో నాటలాడుచు "బావకు వంత చేసిపెత్తుతాను; పొయ్యిలుపెట్టి పెత్తుమని శ్రీధరుని నిర్బంధించెను. శ్రీధరుడు వెంటనే చిల్లపెంకులతో ప్రొయిలు సమర్చి, పూచికపుల్లలను వంట చెఱకుగా జేసి లక్కచిట్లను ప్రొయిలమీద నెక్కించి "లలితా, ఇక బావకు వంటచేసిపెట్టుకో" యనెను.

లలిత:—"చీరకత్తూ మఱి" అని ఒకపాత గుడ్డను దెచ్చెను. శ్రీధరుడు పైటవేసి చీరకట్టగను లలిత పైటచెఱగు దీసి నెత్తిన వేసికొనినది.

శ్రీ:—లలితా! ఆ ముసు గేమిటి?

ల:—మరికత్తుకున్నా. వంత చేయవద్దూ?

శ్రీ:—మరికత్తుకుంతే నెత్తిన గుడ్డెందుకు?

ల:—మన చుబ్బమ్మ వేచుకోలం లేదూ?

శ్రీ:—ఛీ! తప్పు. అమ్మలాగ చక్కగా చీర కట్టుకొని వంటచేయవలె.

లలిత ఒప్పుకొనలేదు. వారి యింటిలో వితంతువగు వంటలక్క నెత్తిన ముసుగు వేసికొనుటచే అది మడికిని వంటకును ఒక లక్షణముగా లలిత గ్రహించినది. శ్రీధరుడు మెంతయో బతిమాలి చెప్పగ చెప్పగ లలిత బూబు ముసుగుతీసినది. పెద్దచిట్టిలో వేచిన కందిపప్పు పోసి, చిన్నచిట్టిలో పచ్చి పెసరపప్పు పోసి ప్రొయిలమీద బెట్టి మలిచి దోపిన చీర చెఱగును చిన్నారి చేతుల మఱి మఱి సవరించుకొనుచు, ఎవరు తగిలెదరో యని మోరమోరల కొత్తిగిలుచు, 'ఉఫ్ఉఫ్' మని ప్రొయిలవద్ద తలవంచి యూదుచు, పండిరాలిన రాచయుసిరికాకులతో లక్కచిట్లను పట్టి దింపుచు లలిత వంటచేయ నారంభించినది. ఇంట నందఱదృష్టి లలితమీదనే, లలితవంట మీదనే నిలిచినది. అన్నిపనులు మానుకొని లలితపచనకార్యముల జూచుచు నిలువబడి పోయినారు. లలితపాకము క్షణములో ముగిసినది. బావను పీటవేసి కూర్చుండబెట్టి ముందొకబాదమాకునువేసి లలిత తనపప్పులవంటకమును వడ్డించినది. బావ తినుచున్నాడు. లలిత కొంచెముదూరములో తలుపుమొత్త నానుకొని రవ్వంత వంచినతలతో నమ్రతను సిగ్గును ప్రకటింపుచు, పైట సవరించుకొనుచు, బావవెస మోరచూపులు చూచుచు నిలువబడి నెమ్మదిగా సన్నమెలుగున "కమ్మలు చేయించరూ" అన్నది. గృహిణిచెయిదముల నంతచక్కగా ప్రకటించిన యాబాలగృహిణి మనోహరాభినయమున కందఱొక్కమాఱు పకపకనవ్విరి. "నాకన్నతల్లి" యెక్కడ నేర్చె

కొంటెవే యీచిన్నారిచేష్ట లని తల్లియాప లేనిసంతసముతో కూతును ముద్దాడెను.



"లలిత...కమ్మలు చేయింపరూ" అన్నది.

అంద రొక్కమాటు నవ్వుటచే లలిత కెక్కడలేనిరోషము వచ్చినది. ఎక్కడవంటక మక్కడనేవదలి బావగారికి మాటువడ్డన సున్నచుట్టి అలిగి మూల కూర్చున్నది. నెత్తి మీదివెండ్రుకలు మొగముమీదకు లాగుకొని వ్రేలికి మెలివేసి యొక్కొక్క వెండ్రుకను త్రెంపుకొనుచున్నది. ఎవరు దగ్గఱకుదీసిన రాలేదు. శ్రీధరునకుగూడ లలిత స్వాధీనము కాలేదు. పెద్దగా నవ్వినవారిలో శ్రీధరుడే ప్రథము డైనప్పుడు లలిత యాతనిమాత్ర మేరీతి క్షమించును?

లలితకోప మింకను తీరలేదు. అందఱి నవ్వులు యింకను ఆగలేదు. ఇంతలో చంద్రశేఖరముగారు కచ్చేరినుండి వచ్చిరి. ఎగ్గుల కీనవ్వు లనిరి. లలిత ముద్దుచేతలనెల్ల తల్లి చెప్పివేచినది, చంద్రశేఖరముగారికి గూడ నవ్వువచ్చినది. కాని నవ్విన లలిత తమవద్దకు గూడ రాదని గంభీరముగా మౌనము వహించి లలితకును, బావకును తాముఅప్పుడేకొనుక్కొని వచ్చిన యీలలలో నొకటి దీసి "బుఙ్" మని యూదిరి. ఆధ్వని చెవులబడగనే లలిత యొక్క పరుగున వచ్చి తండ్రియొడిలోబడి యూదుచున్న యీలను లాగుకొని తా నూదసాగెను. తండ్రి యీ తూతూకు బావ కిమ్మని రెండవయీలను గూడ లలిత కిచ్చిరి. లలిత బావ కిచ్చినది. ఇద్దఱితూతూలతో చెవులు చిల్లులుపడుచున్నవి.

'బావా! బావా! ఈ బాజాలతో అమ్మమ్మబొమ్మకు పెళ్లిచేద్దామా?" అన్నది లలిత. "అట్లాగే" నన్నాడు బావ. వెంటనే అమ్మమ్మబొమ్మను తెచ్చి పీటమీద బెట్టి రెండుచేతులను కాళ్లకు మెలిబెట్టి కూర్చుండి 'జయమంగల' మని పాటలుపాడ నారంభించినది లలిత.

అంతలో నవ్వులు! అంతలో యేడ్పులు! అంతలో అలుకలు! అంతలో ఆటలు! ఏమిటో! ఈశైశవచిద్విలాసము!

మూడవ చినుకు

లలిత కైదేండ్లు వచ్చినవి. మాటలకు చేతలకు రూపునకుగూడ కొంచెము పెద్ద దైనది. తిరుగుమరుగులు తెలిసికొనుటకును చెప్పుటకును చాలిన గ్రాహ్యశక్తికూడ కొంత

యేర్పడినది. లలిత కైదవయేడు వచ్చుటచే కొలదిదినముల క్రిందటనే అక్షరాభ్యాసము చేసిరి. శ్రీధరుడు పలక బలపములను చిన్న బాలశిశువును తీసికొనివచ్చి లలితకు వర్ణపరి



రెండుచేతులను కాళ్లకు మెలిబెట్టి కూర్చుండి........పాటలుపాడ నారంభించినది లలిత.

చయము గల్గింప తిప్పలుపడుచుండెను. అ,ఆ, లు వ్రాసిన, క, ఖ, లు వ్రాసిపెట్టు మనియు, క, ఖ, లు వ్రాసిన బొమ్మలు వేసిపెట్టు మని యు, బొమ్మలు వేసిన మ్రుగ్గులు వేయుమని యు, మ్రుగ్గులు వేసిన నీకు చేత గాదు నేనే వ్రాయుదు నని పలకనిండ సున్నాలుచుట్టియు, లలిత శ్రీధరుని విసిగింపుచుండును.

శీతకాలపు సెలవులలో నొక్కమాటు యింటికివచ్చిపొమ్మని శ్రీధరునకు తండ్రివద్ద నుండి జాబువచ్చినది. శ్రీధరునకు పట్టరాని యానందము గలిగినది. ఉన్నతవిద్యాభ్యాస కౌతూహలముచే తండ్రికి తెలియకుండ బందరు వచ్చి శ్రీధరుడు తండ్రియాగ్రహమునకు గుఱియైనాడు. మూడేండ్లయినను తండ్రి శ్రీధరున కేమాత్రము ధనసహాయము చేయ లేదు సరిగదా యింటికిరమ్మని యొకయుత్త రపుముక్కైనను వ్రాయలేదు. తన ప్రేమా స్పదులగు తల్లిని చెల్లె లిని చూడవలె నను కౌతూహలము శ్రీధ రునకు నానాటి కగ్గలం బగుచున్నను, ధూర్త డగు తండ్రికి వెఱచి శ్రీధరుడు నిజగృహ మున కేగ సాహసింప లేదు. చంద్రశేఖర దంపతులనే జననీజన కులుగ, లలితనే తన బుట్టువుగ భావించి, శ్రీధరుడు ప్రొద్దులు పుచ్చుచుండెను.

నేడు తలవనితలంపుగ తండ్రియొద్ద నుండి యాహ్వానము వచ్చుటచే శ్రీధరునకు మిక్కిలిసంతోషము గలిగెను. తనయొద్ద నున్న పావలాడబ్బులతో చెల్లెలి కొక్కలక్క బరణిని, తల్లికొక్క కుంకుమపు పొట్లమును కొనుక్కొని శ్రీధరుడు స్వగృహమునకు ప్రయాణమయ్యెను. శ్రీధరుడు ఊరికి వెళ్లుట లలిత చూడలేదు. చూచిన తనవెం టపడునని లలితకు తెలియకుండ శ్రీధరుడు వెళ్లిపోయెను.

మధ్యాహ్నమునుండి శ్రీధరుడు లలిత కగుపడలేదు. చాలమాఱులు శ్రీధరునికొఱ కు వెదకినది. కాని అన్న బడికిపోయెనని తల్లి

చెప్పుటచే బడిత్రోవ వంక తదేకదృష్టితో జూచుచు లలిత వీథి యరుగుపై కూర్చున్నది. తల్లి యెన్నిమాఱులు లోనికిరమ్మనినను లలిత రాలేదు. సాయంత్ర మైదుగంటలైనది. శ్రీధరుడు రాలేదు. శ్రీధరుడును లలితయు చల్లగాలికై వెడలుసమయ మది. లలిత కెట్లు తోచును? అన్న యింకను రాలేదేమని లలిత తల్లి నడిగినది. తల్లి యేవేవో కల్లబొల్లిమాటలు చెప్పి చిఱుతిండిపెట్టి లలిత ధ్యానమును మరల్పజూచినది. కాని తల్లిదండ్రులవద్దకన్న శ్రీధరునివద్ద నెక్కువగా మెలగనలవాటు పడిన లలితకు శ్రీధరుడు మఱపువచ్చునా?

ఆ రాత్రి యెట్లో గడచినది. ఉదయమైనది. శ్రీధరుడు కనుపడలేదు. లలిత శ్రీధరునికొఱకు యిల్లంతయు గాలించినది. దొడ్డి యంతయు వెదకినది. వీథి నాల్గువైపుల పరికించినది కనుపడలేదు. వికసితకమలమువంటి లలిత మోము అస్తమయ సమయపద్మమువలె ముకుళించినది. తల్లి బతిమలాడి యన్నముపెట్ట సగమైన తినలేదు. లలిత శ్రీధరునిఁబలుమాఱడుగుటచే విసిగి 'శ్రీధరుడు పూరికి వెళ్ళినాడు యెవరితోనైన నాడుకొను'మని తల్లి చెప్పెను. అన్న కొఱకు కొంతసేపు విలపించి లలిత కన్నీరు తుడుచుకొనినది.

ఈవిధముగా రెండుమూడు దినములు గడచిన తరువాత లలిత శ్రీధరుని యడుగుట మానినను బిక్కమొగము వేసికొని యెప్పటివలె యాటలాడక తిండితినక చిక్కి సగమగుచుండెను.

ఏడుదినము లిట్లు గడచినవి. ఎనిమిదవ నాటిరాత్రి లలితకు పెద్దజ్వరము వచ్చినది. తెల్లవాఱగనే చంద్రశేఖరముగారు వైద్యుని పిలుచుకొనివచ్చి లలితకు మందులు యిప్పించిరి కాని జ్వరము తగ్గలేదు. మూడుదినములైనను లలితకు జ్వరము పట్టినపట్టువిడువలేదు. జ్వరతీవ్రముచే శ్రీధరుడు వచ్చెనన్నప్పుడు దప్ప మఱియొకప్పుడు లలిత కన్నైన విప్పి చూచుటలేదు. ఏలాటి యాహారము పుచ్చుకొనుటలేదు. శ్రీధరుని కొఱకు బెంగపెట్టుకొనుటచేతనే లలిత కిట్టిజ్వరమువచ్చెనని యెల్లరు తలచిరి. కాని లలితకు చాలజబ్బుగానున్నది. వెంటనే రమ్మని చంద్రశేఖరముగారు శ్రీధరునకు తంతినిచ్చిరి. కాని శ్రీధరుని పల్లెగ్రామమునకు తంతి చేరి శ్రీధరుడు పడవ ప్రయాణముచేసి వచ్చునప్పటికి యెంత లేదనినను మూడుదినములు పట్టును. ఈమూడుదినములు గడచు టెట్లనియెల్లరు విచారించుచుండిరి. నాటిమధ్యాహ్నమునుండి లలితకుజ్వరము తొల్లిటికన్న నెక్కువగుటయేకాక తడబాటుమాటలుగూడపుట్టెను. ఆసంధిప్రలాపములు గూడ శ్రీధరునకు సంబంధించినవే! అన్నా! ఈచింత బెత్తికలతో చేసిన ఉంగరాలన్నీ నావే! అన్నా! ఈ రంగులకాగితంతో గాలిపటం కడ్తావా? అన్నా! అన్నా! నీకోసం యెన్ని పిప్పిరిమింట్లు దాచానో చూచావా? అమ్మా! అన్న రాడంటివే! బండిమీద యెక్కి వస్తున్నాడు చూడూ!" అని యీవిధముగా లలిత ప్రలాపించుచుండెను. అస్తమానమగు కొలది లలిత కేకలు మఱింత యెక్కువ యగుటయేకాక

లేచిపోవుటకూడ నారంభించినది. 'ఎక్కడి'కని యెవరైన నడిగినచో, 'అన్నవద్ద'కని లలిత జవాబుచెప్పుచుండెను.

బిడ్డయే వెలుగు. బిడ్డలు నడయాడనికొంప చీకటికొంప. చంద్రశేఖరముగారి గృహదీపము, లలిత, మిక్కిలి విషాదస్థితియందుండుటచే వారియిల్లుచీకట్లుక్రమ్మినట్లుండెను. ఎప్పటివలెనే యింటిలో గాలివీచుచున్నది; వెలుతురు ప్రసరింపుచున్నది; మనుష్యులు తిరుగుచున్నారు; పనులుజరుగుచున్నవి; కాని లలిత మందహాసచంద్రికలు దీపింపమిచే నా యిల్లంధకారావృతమైనదే యున్నది. తమ గృహజ్యోతి; ప్రేమఫలము; హృదయానిక్షేపము; జీవితసర్వస్వము నగు లలిత భయంకర వ్యాధికి లోనగుటచే తల్లిదండ్రుల శోకమునకు పారము లేకుండెను. అందును తల్లి ముఖ్యముగా నాహారనిద్రలేవర్జించి ప్రాచిమొగమైన కడుపుకొరకనొకేవిధముగా శోకింపుచుండెను. శిశూదయముతో తల్లికి ప్రేమోదయమగుట ప్రకృతినైజము; మొగమునిండ మట్టిమరకలతోడను నాసామలముతోడను నసహ్యముగానున్న బిడ్డనుగూడ తల్లిముద్దాడును. కాళ్లు చేతులు సన్నగిలి, పొట్టయుబికి మొగము పాలి యందవికారముగా నున్న బిడ్డనుసైతము తల్లి ప్రేమతో ముద్దుగొనును. కాళ్లనిండ కర్పాణిలేచి, తలనిండ కురుపులులేచ్చి, ఈగలు దోమలు ముసురుచు రోతగలిగించు బిడ్డనుగూడ తల్లి ముద్దుపెట్టుకొనును. రోగారోగముల, సురూపవిరూపముల, వివేకావివేకముల, హాసశోకముల విచక్షణ తల్లిప్రేమచుంబనములకు లేదు; పెరవారి కామంచిచెడ్డలు. ఆకారులమీదను, అనాకారులమీదను, రోగులమీదను నీరోగులమీదను, వికలాంగులమీదను సుకలాంగులమీదను సమదృష్టితో సమానముగా ప్రవహింపగలది మాతృప్రేమప్రవాహ మొక్కటే! ఆప్రేమవాహినికి సాదృశ్యమున్నదా జగతిని మఱియొకటి? లలిత అందఱముద్దుబిడ్డ. తనజగన్మోహనరూపలావణ్యముచే, తనమనోజ్ఞశైశవ క్రీడాకలాపములచే, తనయవ్యక్తమృదుమధురాలాపములచే లలితపితృగృహమును బృందావనముచేసి బాలకృష్ణునివలె యెల్లర హృదయము లాకర్షించినది. అట్టి లలిత జననీజనకులప్రేమ కొల్లగొనెననుటలో నాశ్చర్య మేమిగలదు? లలితకు జబ్బుచేసినది మొదలు లలిత యాటపాటలు మఱింత తలపునకు వచ్చి వారినిదుఃఖవివశులనుగాజేయుచుండెను.

ఇంట నేమూలజూచినను లలిత క్రీడావస్తువులే! లలిత చొక్కా పరికిణీలే! లలిత చేతుల నలంకరింపక, లలితమేను శృంగారింపక నామూల నామూల నేలదొరలుచున్నయాటవస్తువులను వస్త్రములను జూచి తల్లిదండ్రు లేరీతి భరింపగలరు? ఏగోడను జూచిన లలిత చిన్నారిచేతులతో గీచిన బొగ్గుగీతలే. బిడ్డ ప్రాణాపాయ స్థితియందున్నప్పుడు ఆబొగ్గుగీతలు గూడ తల్లిదండ్రుల హృదయమునకు అంపపుకోతలేగదా! మగవాడగుట తండ్రియేదోవిధముగా దుఃఖమొకింత యాపుకొనినను కన్నతల్లి దానినిజూచి కడుపు పగిలి వాపోవక యెట్లుండగలదు?

ఉదయము కాగానే మరల డాక్టరునుతీసి కొనివచ్చిరి. డాక్టరు వచ్చి నాడి పరీక్షించి, నాలుకచూచి, జ్వరపు పుల్లతో జ్వరమును కొలిచి, పెదవి విరచి, కన్నులు మిటకరించి "నూటనాలుగుడిగ్రీలు; విషజ్వరము; యిరువది యొక్క దినములు గడువు. సీసా పంపండి; మందుపంపుతా"నని చెప్పి వెళ్లిపోయెను. వైద్యుడే నిరాశా వచనములు పలికినప్పుడు యిక ఆశ యెవరికి! అకటా!

నాల్గవ చినుకు

పగలు రెండుగంటలైనది. వస్త్రగింజవేసిన పేలగింజ యగునంతటి తీవ్రముగా నున్నది లలితజ్వరము. "అదిగో బండి, దానిమీంద యెక్కిపోతా"నని లలిత ప్రలాపించుచుండెను. లలిత జీవితాశాలత యేశోషిల్ల ఇంటనున్నవా రందరు లలిత మంచముచుట్టు గ్రుడ్ల నీరు గ్రుడ్ల గ్రుక్కుకొనుచు కుప్పలుగూలికూర్చుండిరి. చంద్రశేఖరముగారొక్కరు మాత్రమే లలితపక్కమీద బిక్కమొగముతోగూర్చుండి యుండిరి.

లలితతల్లి:—మందులు మాకులు పనిచేయవు. శ్రీధరుడువచ్చిన చాలును. లలిత జబ్బ నయమగును.


తం:—నిజమే. నాకు గూడ అదే ఆశగా నున్నది. కాని మన తంతిజేరి ఆ లంకనాలబోటుమీద ప్రయాణముచేసి శ్రీధరుడు త్వరలోవచ్చుట సాధ్యమా!

త:—రాకపోయిన యింత తీవ్రస్థితిలోఎన్నాళ్లు గడచును.

బాంమ్మ:—టపాపడవలో నెక్కినచో యీదినమే రావచ్చును.

త:—ఏమో! అంత పుణ్యమా! శ్రీమన్నారాయణమూర్తికి మనయందంత కృప గలదా?

అని యిట్లనుకొనుచుండగనే వాడి, డస్సి, కృశించి, మొగమునిండ చెమటలుకారుచుండ



వాడి, డస్సి, కృశించి......శ్రీధరు డెదుట ప్రత్యక్ష మయ్యెను.

శ్రీధరు డెదుట ప్రత్యక్షమయ్యెను. శ్రీధరుని జూడగనే యందరొక్కమారు బావురుమనిరి. చంద్రశేఖరముగారికి గూడ దుఃఖమాగలేదు. శ్రీధరా! ఈపిల్ల ప్రాణములు నీకొఱకు నిలిచియున్నవి. చూడుమని కన్నీరు జొటజొట కారుచుండ పలికిరి. శ్రీధరునకు నాపరాని దుఃఖమువచ్చినది. కన్నీళ్ల నుత్తరీయాంచలనమున నొత్తుకొనుచు "లలిత"

యని యొక్క మాటలు గద్గదస్వరముతో పలికి శ్రీధరుడు నేల చతికిలబడెను. శ్రీధరుని కంఠధ్వని చెవ్వులబడగనే లలిత చప్పునకన్నులు తెఱచి నలువైపుల చూచెను. చంద్రశేఖరము గారు లలిత పక్కపైనుండి లేచి నిలువబడి "శ్రీధరా? లలిత నీకొఱకు కన్నులు విప్పి చూచుచున్నది. దగ్గఱకు వచ్చి పలుకరింపు" మనిరి. శ్రీధరుడు లలితదగ్గఱకువచ్చి లలిత పై చేయివైచి "ఏమమ్మా, జ్వరముగా నున్నదా?" యనెను. "ఊఁ, అన్నా! ఎత్తుకో" అని లలిత రెండుచేతుల నెత్తెను.

"నీకు జ్వరముగా నున్నదిగా! లేవలేవు. రేపు జ్వరము పోయినతరువాత ఎత్తుకొంటాను. నీదగ్గరగా కూర్చుంటాను. సరేనా"

"అయితే బబ్బో!"అని లలితపక్కకొత్తిగిలినది. శ్రీధరుడు నిస్సందేహముగా లలిత పక్కలో పడుకొనినాడు. లలిత యాతనిని కోతిపిల్లవలె గట్టిగా కౌగిలించుకొనినది.

నిముసము క్రిందట పిచ్చిమాటలాడుచు మైమఱచియున్న లలిత క్షణములో మంచి పిల్లవలె నింత చక్కగా మాట్లాడుట యెల్లర కాశ్చర్యము గొల్పుటయేకాక లలిత జీవించు నను నాశ యెల్లరహృదయముల నానంద భరితము గావించెను. కోల్పోయిన పెన్నిధిదొరకినట్లు గతించిన బాలలబ్ధ జీవి యైనట్లు తల్లిదండ్రులు సమ్మోదమందిరి. కాని లలిత కిది మంచి తెలివి యగునో కాదో, యను సంశయము వారి శంకను పీడించుచునే యుండెను. క్షణక్షణము లలిత యొడలిపై చేయివైచి చంద్రశేఖరముగారు చూచుచుండిరి. క్రమక్రమముగా లలిత శరీరోష్ణము తగ్గుచున్నట్లు గోచరించెను. రోగము తీవ్రముగా నున్నప్పుడు రోగియందెట్టిమార్పుగలిగినను భయ కారణమే కదా. 'లలితయొడలి వేడిమి తగ్గుచున్నది. ఏమిచేయుద'మని యంద రాతురపడిరి. "లలితా!" యని శ్రీధరుడు పిలిచెను. ఆఁ "నీవు వూరికి పోవ"ద్దని లలిత శ్రీధరుని మరింత గట్టిగా నాలింగన మొనర్చుకొనెను. "లలితకు జ్వరము తగ్గుచున్నది. తెలివిగా పలుకుచున్నది. భయములేదు. తొందర పడకు"డని శ్రీధరుడనెను."ఎందుకైననుమంచిది. ఈకస్తూరిమాత్రలను లలిత నోటిలో వేయు" మని రెండుమాత్రలను చంద్రశేఖరము గారు శ్రీధరునిచేతిలో నుంచిరి. శ్రీధరుడు లలితను 'నోరు తెరువు'మని మాత్రల నోటిలో వైచెను. లలిత గుటుక్కునమ్రింగి పడుకొనెను.

జ్వరము తగ్గినకొలది లలితకు నిద్రపట్టినది. శ్రీధరుడు మెలకువతో నున్ననుతాను లేచిన లలిత లేచునేమోయని యట్లే పడుకొనియుండెను. లలిత శరీరోష్ణమునకు శ్రీధరుని శరీరము స్వేదసిక్తమైనది. శ్రీధరుని తనుస్పర్శచే జ్వరముపోయి లలిత శరీరము చెమ్మగిలినది. ఆయిరువురి శరీరములనుండి వెలువడుచున్న ఘర్మసలిలములచే పక్క యంతయు తడిసి ముద్దయగుచున్నది. లలిత శ్రీధరుని విడువదు. శ్రీధరుడు లలితను కాదని లేవడు. వారిపాలిటి కవి జుగుప్సాకరములగు స్వేదకణజాలములు కావేమొ! ప్రేమసుధారస బిందువు లేగాం!

## అయిదవ చినుకు

నాలుగుగంటలకు లలితకు మెలకువ వచ్చెను. కన్నులువిచ్చి చూచెను. శ్రీధరుడు పక్కలోనె యుండెను. లలితకు సంతోషమును సంతుష్టియు గలిగెను. అన్నా! మంచి నీళ్లని లలిత యనెను. వట్టిమంచినీళ్లెందుకని మెలిన్సఫుడ్డు పిండితో కొంచెము జావచేసి తల్లి యిచ్చెను. శ్రీధరుడు దానిని త్రాగించెను. లలితజ్వరము పూర్తిగాపోయి జావ కొంచెము త్రాగుటచే లలితమోము మబ్బువీడిన జాబిల్లివలె ప్రకాశించి యెల్లర శోకాంధకారముల బోకార్చెను. "అన్నా! ఎత్తుకో"అని లలిత మరల చేతు లందిచ్చెను. వలదనిన వినక లలిత యేడ్వసాగెను. శ్రీధరుడు యెత్తుకొనెను.

"అక్కడకు తీసుకుపో"

"ఎక్కడకు"

లలితకు మాటస్ఫుటము లేదు. మాటాడు శక్తి లేదు. మాటలు తడబడుచున్నవి కాన మాటచెప్పలేక యేడ్చుచు "అక్కడికే" యనెను. శ్రీధరుడు వాకిలిలోనికి తీసికొనిపోయెను.

"కాదు" అని లలిత గీతరాగము పెట్టెను. శ్రీధరుడు మరల వంటయింటిలోనికి తీసికొని వెళ్లెను.

"అబ్బా! కా"దని లలిత యేడ్చెను. "మరి ఎక్కడకు తీసికొని వెళ్లనమ్మా! చెప్పు"మని శ్రీధరుడు బుజ్జగించి యడిగెను.

"ఆ గదిలోకి"

"ఈసామాను గదిలోనికేనా?"

"ఆఁ"


శ్రీధరుడు లలితను సామాను గదిలోనికి తీసికొనివెళ్లెను. లలిత విశేషముజబ్బుగానుండి మారాముచేయుచుండుటచే యేదియోభీతిచే తల్లిదండ్రులు, బామ్మ అమ్మమ్మ మున్నగువా రందఱు శ్రీధరుని తోపాటు లలిత వెంటనే యుండిరి. లలిత యాసామాను గదిలో నొకమూలనున్న కుండవద్ద కందరను తీసికొని వెళ్లెను. ఆమూలనున్న కుండపై లలిత పలక మూతపెట్టబడి యుండెను. లలిత యక్కడ శ్రీధరుని చంకనుండి దిగి దడదడ లాడుచు నిలువబడి యాకుండపై బెట్టిన పలకమూతను రెండుచేతుల దీసి "అన్నా! తీసికో, తిను," అనెను.

"ఏమి టవి?"

"ఇవిగో, చాలావున్నాయి, చూడు. "నావి నే తిన్నాను; నీవి నీ కుంచాను. చూచుకో, నే నెంత మంచిదాన్నో!" అని లలిత మనోహరముగ నవ్వెను.

చంద్రశేఖరముగా రాశ్చర్యముతో నా భాండమునం దేమిగలదో యని చేయిపెట్టి చూడబోయిరి. "అబ్బా! నీకుగాదు. అన్న"కని లలిత తండ్రి నడ్డగించెను. శ్రీ ధ రు డు చేయిపెట్టి తీసెను, ఏమి! ఆశ్చర్యము! పిప్పిరిమెంట్లు; బిస్కట్లు; కలకండముక్కలు జీడిపప్పులు; చిలగడదుంపలు; మరమరాలు; రొట్టెముక్కలు; కొబ్బరిముక్కలు; పకోడీ ముక్కలు; లడ్డుముక్కలు; ద్రాక్షపండ్లు! లెక్కయేమి? ఆహా దానియందున్న వన్నియు చిఱుతిండి వస్తువులే! శ్రీధరు డూరికివెళ్లిన తరువాత తల్లితండ్రులును యితరులును లలిత

కేమేమి తినుబండారములు పెట్టిరో వాని నెల్ల తనప్రేమపాత్రుడగు శ్రీధరునికొఱకు కాకుండయందు బెట్టి తనపలకను మూతపెట్టి భద్రముగా లలిత దాచినది. తనకు తినుటకు పెట్టిన పదార్థములలో చేతితో సాధ్యమైన వానిని చేతితోను, పంటితో సాధ్యమైనవానిని పంటితోను, ఈ రెంటికి సాధ్యముకాని వానిని దేనితోనైన చితుకగొట్టియు, సగము చేసి యన్నభాగమని దాచియుంచినది. లలిత జబ్బు గొడవలోపడి కొట్టుకొనుటయేకాని యామూలనున్న కుండను చూచినవారెవ్వరు? కాని యింతటివ్యాధిలోగూడ లలిత యాకుండనుమఱచిపోకుండ శ్రీధరున కొప్పచెప్పటా శ్చర్యముగదా! లలిత దాచినయావస్తువులలో


తెలుగు విశ్వవిద్యా
గ్రంథాలయం
సంఖ్య
తేది 18 10
శ్రీధరుని పంకనుండి దిగి దడదడలాడుచు నిలువబడి యాకుండపై.........'అన్నా తీసికో, తిను' అనెను.

కొన్ని ఎండినవి, కొన్ని కుళ్లినవి, కొన్ని పాసినవి, కొన్ని చీమలచే చూర్ణమైనవి; కాని యే రూపాంతరమందినను యెట్టి దుర్వాయువుల గొట్టుచున్నను, అందలి ప్రతిపదార్థము లలిత యపూర్వప్రేమను ప్రకటించుచునే యుండెను.

శ్రీధరు డా పదార్థములను చేతికి తీసికొనగనె వికసితవదనముతో మధురమందహాసముల వెదజల్లుచు లలిత "అన్నా! నీకోసం యెన్ని దాచానో! చూచావా!"యనెను, లలిత తనయందు చూపినయపూర్వప్రేమకు శ్రీధరుడు విభ్రాంతుడైపోయెను. శ్రీధరుడుగూడ లలితనుప్రేమతో జూచుచున్నమాట వాస్తవమే; కాని యింత అపరూపమైనదా, అమూల్యమైనదా, అకల్మషమైనదా, శ్రీధరుని

ప్రేమ? అగుననుటకు శ్రీధరునిహృదయము జంకినది. లలితయడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తర మిచ్చుటకు శ్రీధరుడు "చూచితిని తల్లి"యని లలితను ముద్దుగొనెను.

శ్రీధరునియందు లలిత కింతటిప్రేమ యుండబట్టియే యంతదిగులు! అంతజ్వరము! ఈప్రేమధనమును శ్రీధరున కప్పగించుటకే కాబోలు లలిత జీవములు నిలిచియున్నవి. "శ్రీధరా నీప్రేమధనమును లలిత నీకొప్పగించి నది. నాప్రేమ ధనమును నీవు నాకొప్పగించితి" వని చంద్రశేఖరముగా రానందముతో బలికిరి. లలిత కిక జ్వరము రాలేదని చెప్పవలెనా?

వినిర్మలమును, మధురమును, మనోజ్ఞమును, ననిర్వచనీయానంద సంధాయకమును నగు శిశుప్రేమసుధారస మొక చినుకానినను చాలు ఆనందతన్మయతనందుటకు. ప్రపంచమునందలి యేయనంతప్రేమసుధారసములైన శిశుప్రేమసుధామాధురికి సాటియగునే!

# లక్ష్మీపతిస్తవము

మోదర్ల రామకృష్ణయ్యా గారు, బి. ఏ.,

సవనాద్యుత్తమపుణ్యకర్మరచనాసౌభాగ్యముం గల్గియుం
భవదీయాంఘ్రిసరోరుహద్వయి నెదం భావింపకున్నం జనుల్
వివిధాభీష్టఫలప్రదానసుగుణస్ఫీతంబు, వైకుంఠవై
భవముం గాంతురె? నిత్యనిర్మలకృపాపాథోధి! లక్ష్మీపతీ!

మ. దురితధ్వాంతవిభేదనక్షమకళాస్తోకంబు, నీమూర్తివి
స్ఫురణం జూపి, కృతార్థజన్మునిగ, నన్ బ్రోవంగదే! త్వత్కృపా
భరముం నాయెడఁ బర్వఁ జేసి, బుధసంప్రార్థ్యంబులౌ సద్గుణో
త్కరముల్ నా కొనఁగూర్పుమీ! పతితరక్షాదక్ష! లక్ష్మీపతీ!

శా. స్వామీ! నిన్ భజయింతుసంతతము మత్స్వాంతంబునన్ భక్తి శ్ర
ద్ధామోదంబులు సాంద్రమై తగ; మహోగ్రాంహస్తరంగావళీ
భీమధ్వానవిభిన్నహృత్సరసిజున్, ప్రీతిన్ భవత్పాదచిం
తామాధుర్యము గ్రోల్చి దాసునిగ, నన్ రక్షింపు లక్ష్మీపతీ!